సోలార్ లైట్లు పంపిణీ

ప్రజాశక్తి -పెదబయలు రూరల్:మండలం సీకరి పంచాయతీ చిట్టంరాయి గ్రామంలో గురువారం పెదబయలు పోలీస్ స్టేషన్, సిఆర్పిఎఫ్ 198 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెట్ శరణ్యరాజు ఆధ్వర్యంలో సోలార్ లైట్లు పంపిణీ చేశారు. జి.మడుగుల సర్కిల్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ 160 మంది గిరిజన కుటుంబాలకు ఉచిత లైట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. చదువుకున్న యువత సంఘ విద్రోహ శక్తుల వైపు వెళ్లకూడదని చెప్పారు.సత్ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీకరి పంచాయతీ సర్పంచ్ గుల్లేలి కృష్ణారావు, ఎంపిటిసి వంతల ఆనందరావు, బూత్ కన్వీనర్ కొర్ర కనకరాజు ం పాల్గొన్నారు.

లైట్లు పంపిణీ చేస్తున్న పోలీసులు

బిజెపి నిరంకుశ, ప్రజా వ్యతిరేక పాలనపై

నేటి నుంచి ప్రచార భేరి

సిపిఎం, సిపిఐ నేతల వెల్లడి

మాట్లాడుతున్న సిపిఎం, సిపిఐ నేతలు

ప్రజాశక్తి-పాడేరు: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తోన్న ప్రజా వ్యతిరేక నిరంకుశ పాలనపై ఈ నెల 14న సీలేరు లో ప్రజా పోరుబాట పాదయాత్ర ప్రచార భేరి ప్రారంభించి 24 వరకు కొనసాగుతుందని సిపిఐ అల్లూరి జిల్లా కార్యదర్శి .పొట్టిక సత్యనారాయణ, సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బోనంగి చిన్నయ్య పడాల్ వెల్లడించారు. గురువారం పాడేరులోని సిపిఎం కార్యాలయంలో ఇరు పార్టీల నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశంలో నరేంద్ర మోడీ కార్పొరేట్, మతోన్మాద విధానాలను అమలు చేస్తున్నారని విమర్శించారు.అధిక ధరలు, నిరుద్యోగం, ప్రైవేటీకరణ, జిఎస్టితో భారాలు తదితర వాటితో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వీటితోపాటు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచడంతో పాటు అదనపు భారాలు బిజెపి మోపుతుందన్నారు. విభజన చట్టంలో హామీలు అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ద్రోహం చేస్తుందన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ, .పోలవరం, కడప ఉక్కు ఫ్యాక్టరీ, రాజధాని నిర్మాణం, .వెనుకబడిన ప్రాంతాలకు నిధులు ఇవ్వక పోవడంతో రాష్ట్రం వెనుక బడుతుందన్నారు. ప్రశ్నించే గొంతుక అని ముందుకు వచ్చిన జనసేన పార్టీ కూడా ప్రశ్నించ లేదని ఆరోపించారు. గిరిజన ప్రాంతంలో సహజ సిద్ధంగా పండిన పంటలకు చిన్న తరహా కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసి గిరిజన నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. పండిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. జీవో 3కి చట్టబద్ధత కల్పించాలని, 100శాతం ఉద్యోగాలు గిరిజనులకు ఇవ్వాలన్నారు. 1/70 చట్టం పటిష్టంగా అమలు చేయాలని కోరారు. గిరిజన గ్రామాల్లో తాగు సాగునీటి సౌకర్యం కల్పించాలని తెలిపారు. అల్లూరి జిల్లాలో శిశు మరణాలు అరికట్టి, గ్రామాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి, హాస్టల్లో హెల్త్ అసిస్టెంట్లను నియమించి విద్యార్థుల ప్రాణాలు కాపాడాలని కోరారు. కొండ పోడు సాగు చేస్తున్న ప్రతి గిరిజన కుటుంబానికి 2005 అటవీ హక్కుల చట్టం ప్రకారం పట్టాలు ఇవ్వాలన్నారు.సిపిఐ, సిపిఎం సాగిస్తున్న పోరుబాట పాదయాత్రను ప్రజలు జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈనెల 14 న సీలేరులో ఉదయం 11 గంటలకు అంబేద్కర్ జయంతి సందర్భంగా పూల మాలలు వేసి పాదయాత్ర ప్రారంభించనున్నట్లు తెలిపారు. పది రోజులపాటు పాడేరు నియోజకవర్గం జీకే వీధి, కొయ్యూరు, చింతపల్లి, జి.మాడుగుల, పాడేరు మండలాల పరిధిలో పాదయాత్ర చేయనున్నట్లు చెప్పారు. 24న పాడేరులో పాదయాత్ర ముగుస్తుందన్నారు. అదే రోజు ప్రజల నుండి వచ్చిన సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాన్ని ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు ఎల్ సుందర్రావు, .దీనబంధు, పాంగి ధనుంజయ్, జి సత్యనారాయణ, సిపిఐ నేతలు కూడా రాధాకృష్ణ, కె సింహాచలం, డి.సతీష్ పాల్గొన్నారు.

ప్రచార బేరి పోస్టర్ ఆవిష్కరణ

పాడేరు: కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ నిరంకుశ పాలనను వ్యతిరేకిస్తూ, మోడీని గద్దె దింపండి- దేశాన్ని కాపాడండి అనే నినాదంతో వామపక్షాల ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి 24 వరకు నిర్వహిస్తున్న ప్రజా పోరుబాట పాదయాత్రపై ప్రచార బేరి పోస్టర్లను గురువారం పాడేరులో వామపక్ష నాయకులు ఎల్ సుందర్రావు, రాధాకృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పాడేరు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో నిర్వహిస్తున్న ఈ పాదయాత్రను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బిజెపి మతోన్మాద, కార్పొరేట్ అనుకూల, ప్రైవేటీకరణ విధానాలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగ, ప్రజాస్వామిక హక్కులను కాపాడి, ఏపీకి ప్రత్యేక హెూదా, విభజన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ నాయకులు బాలన్న, వరహాలు బాబు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

జన సంచారం లేక నిర్మానుష్యంగా ఉన్న సీలేరు మార్కెట్ రోడ్డు

భానుడు భగభగ..

- సీలేరులో 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- ప్రజలు ఉక్కిరి బిక్కిరి

ప్రజాశక్తి -సీలేరు

భానుడు భగభగ మండిపోయాడు. సూర్య ప్రతాపంతో జీకే వీధి మండలం సీలేరులో గురువారం 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. నాలుగు రోజుల నుంచి ఎండ తీవ్రత పెరుగుతూ వస్తోంది. మంగళవారం 35 నుంచి 37 మధ్యలో ఉష్ణోగ్రతల నమోదు కాగా, బుధవారం దాదాపు 38 డిగ్రీలు నమోదైంది. గురువారం ఉదయం నుంచి ఎండ తీవ్రత మరింత అధికమై ఉదయం 11 గంటలకే 36 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదు కావడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. క్రమేపి మధ్యాహ్నం రెండు గంటల తర్వాత 40 డిగ్రీలకు ఉష్ణోగ్రత చేరుకోవడంతో ఎండ వేడిమికి తాళలేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. వ్యాపారులు ఎండకి తట్టుకోలేక కాటన్ దుస్తులను తడిపి దుకాణాల ముందు వేలాడదీశారు. ఎండ వేడిమికి తాళలేక జనం బయటకు రాలేదు. దీంతో సీలేరు మార్కెట్ రోడ్డు జనసంచారం లేక నిర్మానుష్యంగా మారింది. మారుమూల ప్రాంతాల గిరిజనులు సమీప అటవీ ప్రాంతంలో పచ్చని చెట్లు కింద సేద తీరుతూ వేడి నుంచి ఉపశమనం పొందుతున్నారు. సాయంత్రం ఐదు గంటల నుంచి ఉష్ణోగ్రతలు క్రమేపి తగ్గుముఖం పట్టడంతో ప్రజలు ఇళ్లలో నుంచి బయటికొచ్చారు. ముందు ముందు ఎండలు మరింత అధికంగా ఉంటాయని వార్తలు రావడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.

మరో ఐదు రోజులు అధిక ఉష్ణోగ్రతలు

అల్లూరి సీతారామరాజు జిల్లాలో రానున్న ఐదు రోజుల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్య అవకాశం ఉందని చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ వాతావరణ నోడల్ అధికారి డాక్టర్ ఎం సురేష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గరిష్ట ఉష్ణోగ్రత 38.8 నుంచి 45.8 డిగ్రీల వరకు నమోదు కావచ్చని, ప్రజల అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

ఆటోపై కూలిన చింత చెట్టు

గోపాలకృష్ణ సేవలు అభినందనీయం

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఐటిడిఎ పిఒగా రోణంకి గోపాలక్రిష్ణ సేవలు మార్గదర్శకమని, గిరిజనాభివృద్ధికి నిబద్ధతతో విధులు నిర్వహించారని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ కొనియాడారు. ఐటిడిఎ పిఒగా ఇప్పటివరకు పని చేసి సర్వే, సెటిల్ మెంట్స్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ అదనపు సంచాలకులు (ఎడి)గా కమిషనరేట్ లో బదిలీ అయిన రోనంకి గోపాలక్రిష్ణకు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటిడిఎ పిఒ వి.అభిషేక్, అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. గురువారం ఐటిడిఎలో వీడ్కోలు సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడతూ, కొత్తగా ఏర్పాటు చేసిన అల్లూరి జిల్లాకు కలెక్టర్ కార్యాలయం ఏర్పాటు చేయడంతో పాటు ఆయా ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటుకు కీలక పాత్ర పోషించారన్నారు. ఏడాది నుండి చక్కని సహకారం అందించారని పేర్కొన్నారు.

జెసి జె.శివ శ్రీనివాసు మట్లాడుతూ, గోపాలక్రిష్ణ ఐటిడిఎ పిఒగా చెరగని ముద్ర వేసారన్నారు. విద్య, వ్యవసాయం, ఉద్యాన వనం, సంక్షేమ పథకాల అమలులో సమర్ధవంతంగా విధులు నిర్వహించారని చెప్పారు. ఐటిడిఎ పిఒ వి.అభిషేక్ మాట్లాడుతూ రోణంకిగోపాలక్రిష్ణలో అరుదైన నాయకత్వ లక్షణాలు ఉన్నాయని ప్రశంసించారు. ఆయన చేపట్టిన విద్య, వైద్యం, మిషన్ కనెక్ట్ పాడేరు, మిషన్ ఏకలవ్య కార్యక్రమాలను కొనసాగిస్తానన్నారు.

రోణంకి గోపాలక్రిష్ణ మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో గిరిజనులకు సేవ చేయడం అదృష్టమన్నారు. ఆదివాసీల జీవన విధానం, సంస్కృతి, ఆచార వ్యవహారలపై అవగాహన పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఒలు విఎస్ ప్రభాకరరావు, ఎం.వేంకటేశ్వరరావు, పరిపాలనాధికారి హేమలత, టిడబ్ల్యూ డిడి ఐ.కొండలరావు, ఇఇలు డివిఆర్ఎం రాజు, కె. వేణుగోపాల్, పీఆర్ ఇఇ కొండయ్య పడాల్ పాల్గొన్నారు.

సన్మానిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్, అధికారులు

పెదబయలు:

బదిలీపై వెళుతున్న ప్రాజెక్ట్ అధికారి గోపాలకష్ణను పాడేరులో మండలంలో కీముడుపల్లి ఆదివాసీ గిరిజనుడు గండేరు నిరీక్షణ రావు గురువారం సత్కరించారు.వివిధ అభివృద్ధి పనులకు సహకరించడంతో సత్కరించినట్లు నిరీక్షణ రావు తెలిపారు.

ఉపాధ్యాయుని జీతం నిలుపుదల సరికాదు

ప్రజాశక్తి- అరకులోయ రూరల్:మండలంలోని లిట్టిగూడ మండల ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు ఎల్.బి చంద్రశేఖర్ జీతభత్యాలు మండల విద్యాధికారిణి ఎటువంటి కారణం లేకుండా నిలుపుదల చేయడం సరికాదని యూటిఎఫ్ నాయకులు చెప్పారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ, జీతాలు నిలుపుదల చేయడంతో కుటుంబమంతా తీవ్రమైన ఇబ్బందులకు గురవుతుందన్నారు.ఉపాధ్యాయుల జీతభత్యాలు ఆపడం ఏ రూల్స్‌లో భాగమని యుటిఎఫ్ నాయకులు ప్రశ్నించారు. చిన్న చిన్న కారణాలతో ఉపాధ్యాయుల జీతభత్యాలు ఆపి ఇబ్బందులకు గురి చేయడం మండల విద్యా శాఖ అధికారికి తగదని తెలిపారు. ఉపాధ్యాయుడు జీతాలు వెంటనే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. గత నెల జీత భత్యం ఆదాయ పన్ను రూపంలో పోగా ఈనెల ఆపివేయడంతో ఉపాధ్యాయుడు పరిస్థితి చాలా దారుణంగా ఉందన్నారు. ఇటువంటి చర్యలు పునరావృతం అయితే ఆందోళన చేపడతామని యుటిఎఫ్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.మహేశ్వరరావు, జిల్లా కార్యదర్శి కె రఘునాథ్, ఏం బాబురావు, అరకువేలి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి.విజయరావు, ఎస్.రామచందర్‌లు పాల్గొన్నారు.

21న పెన్షన్ అదాలత్

-జిల్లా ఖజానా అధికారి ప్రసాద్ బాబు

ప్రజాశక్తి- పాడేరు: ఈ నెల 21న పాడేరు కలక్టరేట్ సమావేశ మందిరంలో పెన్సన్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఖజానాదికారి ఆర్.ప్రసాద్ బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పెండింగ్లో ఉన్న పెన్షన్, జిపిఎఫ్ కేసులను సమీక్షించి, పరిష్కరించేందుకు వీలుగా ఈ పెన్సన్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా అధికారులు సమర్ధవంతంగా, నాణ్యమైన సేవలు సకాలంలో పింఛనుదారులకు, జిపిఎఫ్ చందాదారులకు అందించుటకు ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ అవగాహన కల్పిస్తారని డిటిఓ వివరించారు. 21న 10 గంటల నుంచి జరిగే ఈ అవగాహనా సదస్సును డిడిఓలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాకు చెందిన పింఛనుదారులు కుటుంబ పెన్షనర్లు, జిపిఎఫ్ కు సంబంధించిన ఫిర్యాదులు, వాటి పరిష్కారానికి పెన్షన్ అదాలత్‌కు హాజరు కావచ్చునని డిటిఓ సూచించారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేసారు.

మిషన్ వాత్సల్యపై ప్రచారం చేయాలి

ప్రజాశక్తి పాడేరు: :మిషన్ వాత్సల్య పథకం ఫలాలు అర్హులైన 18 ఏళ్ల లోపు నిర్భాగ్యులు, అనాథలైన పిల్లలందరికీ అందాల్సిన భాధ్యత ఐసిడిఎస్ సిబ్బందిపై ఉందని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్(ఎస్సిపీసిఆర్) సభ్యుడు గొండు సీతారాం సూచించారు. ఇటీవల దేశ వ్యాప్తంగా ప్రవేశ పెట్టిన మిషన్ వాత్సల్య పథకంపై స్త్రీ,శిశు సంక్షేమ శాఖ,జిల్లా బాలల సంరక్షణ అధికారులు, వార్డుల సచివాలయాలు ప్రతినిధులతో ఆర్వి నగర్‌లోని శాంతి సాధన స్కూల్ సమావేశ మందిరంలో ఐసిడిఎస్ ,అంగన్వాడి కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో పాల్గొన్న సీతారాం మాట్లాడుతూ, ధ్రువీకరణ పత్రాల జారీపై అడిగి తెలుసుకున్నారు.ప్రతీ గడప గడపకు ఈ పథకం అమలుపై ప్రచారం నిర్వహించడంలో చైల్డ్ డెవలప్మెంట్ ప్రోజెక్ట్ అధికారులు, సూపర్ వైజర్ లు, అంగన్వాడి కేంద్రాల కార్యకర్తల పని తీరుపై అధికారులతో సమీక్షించారు అనంతరం సీతారాం మాట్లాడుతూ, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ఈ పథకాన్ని అమలు చేయనున్నాయని తెలిపారు. ఈ పథకం అమలుపై గడప గడపకు ప్రచారం చేపట్టాలన్నారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా అందిన దరఖాస్తులు, జనన ధృవీకరణ పత్రాలు మంజూరులో గ్రామ పంచాయితీ అధికారులు సహాయ సహకారాలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సమీక్షలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వంతెనల నిర్మాణానికి మోక్షమెప్పుడు?

- రెండేళ్ల క్రితం నిధులు మంజూరు
- నేటికీ పనులు చేపట్టని వైనం
- వర్షా కాలంలో రాకపోకలకు ఇబ్బంది పడుతున్న గిరిజనులు

ప్రజాశక్తి-కొయ్యూరు

వైసిపి ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరైనా పనులు చేపట్టడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలోని ఉల్లిగుంట చీడిపాలెం, మఠంభీమవరం, పలకజీడి పంచాయతీల పరిధిలో గెడ్డలు, కాలువపై బ్రిడ్జిలు నిర్మాణానికి కోట్ల రూపాయలు నిధులు రెండేళ్ల క్రితం మంజూరైనా నేటికీ నిర్మాణ పనులు ప్రారంభించలేదు.

కొయ్యూరు- వై.రామవరం వెళ్లే ప్రధాన రహదారి నుండి లోపలకి ఉల్లిగుంట చీడిపాలెం వెళ్లే మార్గంలో గొట్టెలపాడు వద్ద ఉన్న గెడ్డ వర్షా కాలంలో పొంగి ప్రవహిస్తుండడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. వర్షా కాలం నాలుగు నెలలు సుమారు 15కు పైగా గ్రామాల ప్రజలకు మిగిలిన ప్రాంతాలతో పూర్తిగా సంబంధాలు తెగిపోతున్నాయి. అత్యవసర పరిస్థితులలో రోగులను ఆసుపత్రులకు తరలించలేకపోతున్నామని, విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడానికి కాలువ దాటి వెళ్లలేక పోతున్నారని, గొట్టెలపాడు వద్ద గెడ్డపై బ్రిడ్జి నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు అనేకసార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించారు. చివరికి రెండేళ్ల క్రితం బ్రిడ్జి నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరయ్యాయి. ఏడాది క్రితం పాడేరు ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి శంకుస్థాపన కూడా చేశారు. కాని ఇప్పటికీ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. ఇదే కాకుండా మఠంభీమవరం పంచాయతీ, వేమనపాలెం నుండి జంగాలతోట మధ్యలో గెడ్డపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.2.50 కోట్లు, పలకజీడి పంచాయతీ పరిధి ఈదులుబంధ, గొంది కోట మధ్యలో కాలువపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.2.30 కోట్లు రెండేళ్ల క్రితం మంజూరయ్యాయి. ఈ బ్రిడ్జిల నిర్మాణానికి నేటికీ శంకుస్థాపనే జరగలేదు. ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి ఈ ప్రాంతాల్లో పర్యటనకు వచ్చిన సందర్భాల్లో నిధులు మంజూరయ్యాయని, వంతెనల నిర్మాణం వెంటనే చేస్తామని చెబుతున్నారు తప్ప ఆచరణలో ఒక్క బ్రిడ్జి నిర్మాణం కూడా చేపట్టడం లేదు. ఎమ్మెల్యేతో పాటు ఆమె వెంట వచ్చిన వైసిపి మండల నాయకులు కూడా ఈ బ్రిడ్జిల విషయం మరిచిపోయారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రెండేళ్ల క్రితం మంజూరైన నిధులకు సంబంధించి పనులు చేపట్టకపోవడంతో ఆ నిధులు ఏమయ్యాయని, వెనక్కి వెళ్లిపోయాయా? లేదంటే దారి మళ్లించారా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు మాత్రం నోరుమెదపడం లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమ సమస్యను అర్థం చేసుకొని నిధులు మంజూరైన మూడు బ్రిడ్జిలను వెంటనే నిర్మాణం చేపట్టాలని ఆయా పంచాయతీల ప్రజలు కోరుతున్నారు.

గొట్టెలపాడు గెడ్డ పొంగి ప్రవహిస్తుండడంతో తాడు సహాయంతో అవతలి ఒడ్డుకు వెళ్తున్న గిరిజనులు (ఫైల్‌ఫొటో)

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి సిపిఎం సాయం

ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్

ప్రజాశక్తి- చింతూరు : అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయి సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే రూ.50వేలు ఆర్థిక సాయం అందించాలని సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్, నాయకులు సీతారామయ్య ఎర్రంశెట్టి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మండలంలోని ఉలుమూరు గ్రామంలో రోజు కూలి అయిన రామకృష్ణ కుటుంబం కూలి పనులకు వెళ్లగా, ఆయన ఇంటికి నిప్పు అంటుకొని ఇల్లు అగ్నికి ఆహుతైంది. ఇంట్లో ఉన్న టీవీ, బట్టలు, వంట సామగ్రి, ఇతర గృహోపకరణాలు కాలిబూడిదై, సర్వం కోల్పోయి ఆ కుటుంబం రోడ్డున పడింది. ఈ నేపథ్యంలో సిపిఎం నాయకులు గురువారం సంఘటనా స్థలాన్ని పరిశీలించి రామకృష్ణ కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు, వంట పాత్రలు, దుప్పట్లు, ఛార్జింగ్ లైట్ అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ రోజు కూలిగా జీవిస్తున్న రామకృష్ణ కుటుంబానికి ప్రభుత్వం తక్షణ సహాయంగా రూ.50వేలు ఇవ్వాలని, జగనన్న గృహ నిర్మాణం కింద తక్షణమే ఇల్లు మంజూరు చేసి నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కారం నాగేష్, కారం లక్ష్మయ్య, రాజయ్య, బాబురావు, మడివి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

బియ్యం, బట్టలు, నిత్యావసరాలు అందజేస్తున్న సిపిఎం నాయకులు

ఈదురుగాలుల బీభత్సం

చెట్లు విరిగిపడి ఇళ్లు, ఆటో, అంబేద్కర్ విగ్రహం ధ్వంసం

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలో గురువారం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 3 గంటలకు ఉరుములు మెరుపులతో వర్షం పడటంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. వర్షానికి జనజీవనం స్తంభించిపోయింది. ఈదురుగాలుల బీభత్సం కారణంగా రాజేంద్రపాలెం గ్రామంలో చింత చెట్టు విరిగి ఆ గ్రామానికి చెందిన ఉగ్గిన రవి ఆటోపై పడింది. దీంతదా ఆటో పూర్తిగా ధ్వంసమైంది. ఇదే గ్రామంలో మరో చింత విరిగి అంబేద్కర్ విగ్రహంపై పడటంతో ఆ విగ్రహం కూలిపోయింది. మండలంలోని సింగవరం గ్రామంలో కొబ్బరి విరిగి రెండు రేకుల ఇళ్లపై పడడంతో ఆ ఇళ్లుధ్వంసమయ్యాయి. తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

టెన్త్ పరీక్షా కేంద్రంలో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం సీలేరులోని పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని గురువారం ప్లేయింగ్ స్క్వాడ్ బృందం ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు నిర్వహించింది. అనంతరం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో జరుగుతున్నాయని, ఐటిడిఏ పిఒ అభిషేక్ ఆదేశాల మేరకు తాము పరీక్ష కేంద్రాన్ని సందర్శించి తనిఖీలు నిర్వహించమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్లేయింగ్ స్క్వాడ్ అధికారులు కృష్ణ, డిప్యూటీ తహశీల్దారు ప్రసన్నకుమార్, ఏఎస్ఐ ఎ.లక్ష్మణ్ పాల్గొన్నారు.

స్పెషల్ స్క్వాడ్ బృందం తనిఖీ

సీలేరులో పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని స్పెషల్ స్కేడ్ బృందం కూడా గురువారం తనిఖీలు చేపట్టింది. బృందం సభ్యులు పరీక్ష సమయం పూర్తయిన తరువాత విద్యార్థులతో పలు విషయాలు చర్చించారు. ఉన్నతమైన చదువులు చదివి మంచి స్థాయికి ఎదగాలని సూచించారు. ఇంటర్‌లో చేరాలనుకునే వారు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని కోరారు. విద్యార్థులు ఎటువంటి మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా పరీక్షలు రాయడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ తనిఖీల్లో ఉదయ కుమార్, కెవివి.సత్యనారాయణ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని వాతంగి గ్రామంలో నివాసముంటున్న పాతర కోటిబాబు (35) అనే వ్యక్తి బుధవారం సాయంత్రం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. జడ్డంగి ఎస్ఐ షరీఫ్ కథనం ప్రకారం... గోకవరం మండలం రామన్నపాలెం గ్రామానికి చెందిన కోటి బాబు నాలుగేళ్ల క్రితం తన భార్య సొంత ఊరు అయిన వాతంగి వచ్చి ఇక్కడే ఉంటున్నాడు. మద్యానికి బానిసైన కోటిబాబు తరచూ భార్య, కుటుంబ సభ్యులతో గొడవపడుతూ ఉండేవాడు. బుధవారం మద్యానికి తన భార్యని డబ్బులు అడగ్గా ఆమె ఇవ్వలేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన కోటిబాబు గ్రామ శివారున పాకలో దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షరీఫ్ తెలిపారు.



భారతరత్న డా॥ బి.ఆర్. అంబేద్కర్
జయంతి శుభాకాంక్షలు
మహా పరిపూర్ణుడు, మానవతావాది, నవ భారత్ పునర్నిర్మాణ దార్శనీకుడు
మన బాబా సాహెచ్ డా॥ బి.ఆర్. అంబేద్కర్
132వ జయంతి శుభాకాంక్షలు
బురిడి సద్దు
(డిప్యూటీ వార్డెన్), సి.ఎ.హెచ్ స్కూల్,
అరకులోయ, అల్లూరి సీతారామరాజు జిల్లా

సంపద తయారీ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి-నక్కపల్లి:నక్కపల్లిలో ఏర్పాటు చేసిన సంపద తయారీ కేంద్రాన్ని ఎంపీడీవో సీతారామరాజు, ఈఓపిఆర్‌డి వెంకటనారాయణ గురువారం పరిశీలించారు. వర్మీ కంపోస్ట్ తయారీ, చెత్త నిర్వహణ తదితర అంశాలను పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. నక్కపల్లి గ్రామాన్ని చెత్త రహిత గ్రామంగా తీర్చిదిద్దాలని సూచించారు. నక్కపల్లి సంపద తయారీ కేంద్రంలో పలు పంచాయతీలకు ఇస్తున్న శిక్షణ పక్కాగా అమలు జరిగే విధంగా చూడాలన్నారు .

ఆలయానికి విరాళం

ప్రజాశక్తి-మాడుగుల:మండలంలోని ఎల్. పొన్నవోలు పంచాయతీ నర్సయ్యపేటలోని రామాలయం నిర్మాణానికి ఎం.కోడూరుకు చెందిన జన సేన నాయకులు రాయపురెడ్డి కృష్ణ రూ.20,116 విరాళం గురువారం అందించారు. గ్రామానికి చెందిన జన సేన కార్యకర్తల ఆహ్వానం మేరకు గ్రామానికి చేరుకుని చెక్కు రూపంలో విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

7న మోదకొండమ్మ పండగ

ప్రజాశక్తి-మాడుగుల:మే 7వ తేదీ ఆదివారం మండలంలోని ఎం.కోడూరు మోదకొండమ్మ పండగ నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు బుధవారం అమ్మవారి పాదాలు, ఘటా లు వూరేగింపు నిర్వహించి సతకంపట్టు వద్ద కొలువు ఏర్పాటు చేశారు. సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన నేతలు పడాల అప్పలనాయుడు, గొల్లవిల్లి రాజేష్, కలిమి గోసమ్మ, పడాల అప్పలరాజు, చింత మూర్తి, గంజి రాజేష్ తదితరులు పాల్గొన్నారు

మధురవాడ బిల్డర్స్ నూతన కార్యవర్గ సభ్యులు

మధురవాడ బిల్డర్స్ నూతన కార్యవర్గం

ప్రజాశక్తి -పిఎం పాలెం : మధురవాడ బిల్డర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా మాతృశ్రీ బిల్డర్స్ అధినేత పోతిన శివ, చైర్మన్‌గా జగదభిరామ్ కనస్ట్రక్షన్ అధినేత నక్క శ్రీధర్, కార్యదర్శిగా ఆకుల శ్రీనివాస్, కోశాధికారిగా కెంబూరి రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా కుమార్, వెంకటరావు, రామకృష్ణ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం అధ్యక్షుడు పోతిన శివ మాట్లాడుతూ, మధురవాడ బిల్డర్స్ అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

15న జాబ్ మేళా

ప్రజాశక్తి -కంచరపాలెం : విశాఖపట్నంలోని ప్రముఖ సంస్థలలో వివిధ పోస్టుల భర్తీకి కంచరపాలెంలోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఈ నెల 15న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సిహెచ్ సుబ్బిరెడ్డి తెలిపారు. ఎస్‌బిఐ ఇన్స్యూరెన్స్ కంపెనీలో బ్రాంచ్ మేనేజర్, సేల్స్ మేనేజర్ ఉద్యోగాలు 25 ఖాళీలకు 21 నుంచి 45 సంవత్సరాలు వయస్సు, ఏదైనా డిగ్రీ అర్హత కలిగిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. వీరికి నెలకు రూ.20 వేల నుంచి రూ.35 వేలు జీతం ఉంటుందని తెలిపారు. ముత్తూట్ పిన్ కార్పొరేట్ సంస్థలో బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలు 35 ఖాళీలకు ఏదైనా డిగ్రీ, పీజీ, అర్హతతో 21 నుంచి 32 సంవత్సరాల వయసు గల అభ్యర్థులు అర్హులని, వీరికి నెలకు రూ.16 వేలు జీతం ఉంటుందని తెలిపారు. స్మార్ట్ సర్వీసెస్ సంస్థలో ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ ఉద్యోగాలు 150 ఖాళీలకు పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ అర్హతతో 34 సంవత్సరాల లోపు గల అభ్యర్థులు అర్హులని, వీరికి నెలకు రూ.21,500 జీతం ఉంటుందని పేర్కొన్నారు. కాలిబర్ సపోర్ట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో బ్రాంచ్ రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలు 40 ఖాళీలకు ఏదైనా డిగ్రీ అర్హతతో 30 ఏళ్ల వయస్సు గలవారు అర్హులని, వీరికి నెలకు రూ.15 వేలు జీతం ఉంటుందని తెలిపారు. మహావీర్ గ్రూప్ స్కోడా సంస్థలో సేల్స్ కన్సల్టెంట్స్ అండ్ టీం లీడర్స్ ఉద్యోగాలు 8 ఖాళీలకు ఏదైనా డిగ్రీతో 18 నుంచి 35 సంవత్సరాల మధ్య గల వారు అర్హులని, వీరికి నెలకు రూ.18 వేల నుంచి రూ.25 వేల వరకు జీతం ఉంటుందని పేర్కొన్నారు. అర్హత ఆసక్తి కలిగిన అభ్యర్థులు ముందుగా ncs.gov.in వెబ్‌సైట్‌లో తమ పేర్లను నమోదు చేసుకొని, అర్హత ధ్రుపత్రాలతో ఆ రోజు హాజరు కావాలని కోరారు.

పోడు పట్టాల మంజూరుకు సన్నద్ధం

సర్వే పనులు పూర్తి- సాగు రైతుల్లో వెల్లువెత్తుతున్న సంతోషం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో పోడు భూములకు పట్టాల మంజూరు చేసేందుకు అధికారులు సర్వేలు పూర్తి చేయడంతో సాగులో ఉన్న రైతులలో సంతోషం వెలువెత్తుతోంది. సుమారుగా 20 సంవత్సరాల నుంచి పోడు భూములను సాగు చేసుకుంటున్న రైతులు పట్టాలు కావాలంటూ పలుమార్లు ఉన్నతాధికారులకు ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా అది కార్యరూపం దాల్చలేదు. ప్రభుత్వాలు మారుతున్నా పోడు భూముల సాగు చేసుకున్న రైతులకు మాత్రం పట్టాల మంజూరులో ముందుకు అడుగు వేయలేకపోయారు. ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ అభ్యర్థన మేరకు ప్రభుత్వం పోడు భూములకు పట్టాలు మంజూరు చేస్తామని ఇచ్చిన హామీతో ఉన్నతాధికారుల సహకారంతో పట్టాల మంజూరుకు చర్యలు చేపట్టారు.

గ్రామాల వారీగా సర్వే

గొలుగొండ మండలంలో పోడు భూముల సర్వే కార్యక్రమం పూర్తయింది. మండలంలో 10 రెవెన్యూ గ్రామాల్లో ఫిబ్రవరి నెల ప్రారంభం నుంచి రెండు నెలల కాలంలో 345 మంది రైతులు సాగు చేస్తున్న 366.5 ఎకరాల్లో సర్వేయర్ల బృందంతో ఇన్చార్జి తహసిల్దార్ జి.ఆనంద్‌రావు నేతృత్వంలో సర్వే పనులు పూర్తి చేశారు. చోద్యం రెవెన్యూలో 179 మంది రైతులకు 190.44 ఎకరాలు, గాదంపాలెం రెవెన్యూలో 8 మంది రైతులకు 8.21 ఎకరాలు, పప్పుసెట్టిపాలెం రెవెన్యూలో 37 మంది రైతులకు 22.34 ఎకరాలు, నాగన్న దొరపాలెం రెవెన్యూలో పది మంది రైతులకు 9.57 ఎకరాలు, నల్లంకి రెవెన్యూలో 11 మంది రైతులకు 12.5 ఎకరాలు, అమ్మపేట రెవెన్యూలో 10 మంది రైతులకు 10.57 ఎకరాలు, కొత్త మల్లంపేట రెవెన్యూలో 19.81 ఎకరాలు, పొగచెట్లపాలెం రెవెన్యూలో 36.13 ఎకరాలు, పాకలపాడు రెవెన్యూలో 40 మంది రైతులకు 55.29 ఎకరాలు, కొమిర రెవెన్యూలో ఒక రైతుకు 1.63 ఎకరాల భూములను సర్వే చేసి రెవెన్యూ అధికారులు పట్టాల మంజూరుకు సిద్ధం చేశారు. లబ్ధిదారులందరికీ పట్టాలు మంజూరు చేయడానికి ఉన్నతాధికారులకు నివేదికలు కూడా పంపించారు. పట్టాల మంజూరు త్వరలోనే జరుగుతుందని ఉన్నతాధికారులు తెలియజేసి నట్లు ఇన్చార్జి తహసిల్దార్ తెలిపారు.

సిఎం సహకారంతో మంజూరు

గడపగడపకి మన ప్రభుత్వం కార్యక్రమంలో పోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని రైతుల అందించిన వినతుల మేరకు ఈ విషయాన్ని ముఖ్యమంత్రి జగన్ దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది. ఆయన సానుకూలంగా స్పందించి అనుమతులు మంజూరు చేయడంతో ఉన్నతాధికారుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాం. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సర్వేలు పూర్తయ్యాయి. త్వరలోనే సాగు చేసుకుంటున్న రైతులందరికీ భూపట్టాలు మంజూరు చేస్తాం.

పెట్ల ఉమా శంకర్ గణేష్,
ఎమ్మెల్యే , నర్సీపట్నం

365.5 ఎకరాలు అందించేందుకు చర్యలు

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోడు భూముల పట్టాల మంజూరుకు 10 రెవెన్యూ గ్రామాల్లో సర్వే పూర్తి చేశాము. 10 రెవెన్యూ గ్రామాల్లోనూ 340 మంది రైతులకు 365.5 ఎకరాల భూమిని అందించడానికి అన్ని పనులు పూర్తి చేసి నివేదికలను ఉన్నతాధికారులకు పంపించడం జరిగింది. ఇటీవల సుమారు 20 మంది రైతులు పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వారందరికీ రెండవ దశలో సర్వేలు నిర్వహించి పట్టాలు మంజూరు చేస్తాం. ఇంకా పోడు భూములు సాగు చేసుకుంటున్న రైతులు ఎవరైనా ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలి.

జి.ఆనంద్ రావు,
ఇన్చార్జి తహశీల్దార్

497వ రోజుకు మహా ధర్నా

ప్రజాశక్తి -నక్కపల్లి:హెటిరో మందుల కంపెనీ కొత్తగా వేస్తున్న పైపులైన్‌కు సంబంధించి తమకు న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని మత్స్యకార నాయకులు స్పష్టం చేశారు .పైప్ లైన్ కు వ్యతిరేకంగా మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత మహా ధర్నా 497వ రోజుకు చేరింది. గురువారం శిబిరం వద్ద మత్స్యకారులు పైప్ లైన్ కు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మత్స్యకారులు మాట్లాడుతూ, చేపలు వేట తప్ప తమకు మరో ఉపాధి లేదని, సముద్రాన్ని కలుషితం చేసి పొట్ట కొట్టొద్దన్నారు. ఇప్పటికే ఉన్న పైప్ లైన్‌తో కంపెనీ వ్యర్థ జలాలు సముద్రంలోకి విడిచి పెట్టడంతో ఈ ప్రాంతంలో మత్స్య సంపద నశించి పోయిందన్నారు.కొత్తగా పైపులైన్ ఏర్పాటు చేస్తే తమ మునుగడ ప్రశ్నార్థకమవుతుందని ఆవేదన వెలిబుచ్చారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు గోసల స్వామి, కోడ కాశీరావు, కోత్వాల కాశీ, పిక్కి గంగరాజు, బొంది నూకరాజు, పిక్కి రాజు, చొడిపల్లి రాజు, మైలపల్లి వెంకటేష్, మైలపల్లి శివాజీ, పిక్కి రాజు, మైలపల్లి బాపూజీ, మైలపల్లి జాను, మైలపల్లి బైరాగి రాజు, పిక్కి సత్తి రాజు పాల్గొన్నారు.

చెరువు అభివృద్ధికి చర్యలు : ఎంపిడిఒ

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని కాగిత ఊర చెరువును అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఎంపీడీవో సీతారామరాజు తెలిపారు. గురువారం సర్పంచ్ రాజేష్, ఈఓపిఆర్ డి వెంకటనారాయణతో కలిసి చెరువు ప్రాంతాన్ని పరిశీలించారు. ఊర చెరువు సుందరీకరణ చేపట్టడానికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ మేరకు చెరువు అభివృద్ధి పనులు పై చర్చించారు. చెరువు ప్రాంతమంతా ఆహ్లాదకరంగా తీర్చి దిద్దనునన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరసింహారాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం ఆశిపాలెం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం... భీమిలి మండలం, చిప్పాడ పంచాయతీ, సిటీనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ నగిరెడ్ల రమేష్ (40) వేరొక వ్యక్తికి చెందిన ఆటోలో మందుల కోసం వెళ్తున్నాడు. ఆశిపాలెం వద్ద అకస్మాత్తుగా కుక్క అడ్డంగా రావడంతో ఆటోను షడన్‌గా ఎడమ వైపు తిప్పడంతో బోల్తా పడింది. ఆటో కింద పడిన డ్రైవర్ రమేష్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. రమేష్‌ను సంగివలస ఎఎన్‌హెచ్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సిఐ కె.లక్ష్మణమూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలో జారిపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-యలమంచిలి రూరల్ : కాలువలో జారి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం మండలంలోని జంపపాలెం గ్రామంలో చోటుచేసుకుంది. యలమంచిలి రూరల్ పోలీసుల కథనం ప్రకారం... .జంపపాలెం గ్రామానికి చెందిన గలగా అప్పారావు (47) గురువారం మధ్యాహ్నం పొలంలో పని చేసుకొని శారద నది ఒడ్డుకు వెళ్లి కాళ్లు చేతులు కడుక్కుంటూ ప్రమాదవశాత్తు కాలువలో జారి కాలువలో పడిపోయాడు. అప్పారావుకు ఈత రాకపోవడంతో మునిగిపోయి మృతి చెందాడు. ఈ ప్రమాదంపై అప్పారావు భార్య యలమంచిలి రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్సై కె.సన్ని బాబు తెలిపారు.

కారు బోల్తా

ప్రజాశక్తి -మధురవాడ : గీతం కాలేజీ మీదుగా ఎండాడ జాతీయ రహదారికి వెళ్లే రోడ్డులో గురువారం కారు బోల్తా పడింది. ఇందులో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్ప గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. వారు సమీపంలో ఉన్న గీతం ఆసుపత్రికి వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని మద్ది జంక్షన్‌లో బుధవారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న 40 బస్తాల 40 కిలోల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు సిఐ సన్యాసినాయుడు గురువారం తెలిపారు. పద్మనాభం క్రైమ్ ఎస్ఐ ఆర్ మల్లీశ్వరరావు లోడుతో వెళ్తున్న వాహనాన్ని పట్టుకొని పద్మనాభం పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. ఈ రేషన్ బియ్యం విశాఖపట్నం పూర్ణమార్కెట్ నుంచి మద్ది ఇటుక బట్టిలో పనిచేస్తున్న కార్మికులకు సరఫరా చేస్తున్నారని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ నరసింహం

విజనగిరిపాలెం రోడ్డుకు మోక్షం

ప్రజాశక్తి-సింహాచలం: ఎన్నో ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోని విజనగిరిపాలెం రోడ్డు ఎట్టకేలకు మోక్షం లభించింది. జివిఎంసి 98వ వార్డు కార్పొరేటర్ పీవీ నరసింహం చొరవతో అధికారులు సుమారు రూ.32 లక్షలతో గురువారం రోడ్డు పనులను ప్రారంభించారు. కార్పొరేటర్ పీవీ.నరసింహులు ఈ పనులను పర్యవేక్షించారు. గతుకుల రోడ్డును బాగుచేయడంతో స్థానికులు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

ప్రచారం నిర్వహిస్తున్న వైసిపి కార్యకర్తలు

అంకంపాలెంలో 'జగనన్నే మా భవిష్యత్తు'

ప్రజాశక్తి- కొయ్యూరు

మండలంలోని బకులూరు గ్రామ పంచాయతీ పరిధి అంకం పాలెం గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని వైసిపి నాయకులు గురువారం చేపట్టారు. ఇంటింటికి వెళ్లి వైసిపి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించి, రానున్న రోజుల్లో జగన్ ప్రభుత్వానికి మద్దతు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు జల్లి బాబులు, సర్పంచ్ పొట్టిక శ్రీను, కూడా చిన్నయ్య, గృహ సారథులు మాతే శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న కెవిపిఎస్ నేతలు

బిజెపి హయాంలో..

దళితులు, మైనారిటీలపై పెరిగిన దాడులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులు, మైనారిటీలపై దాడులు పెరిగాయని కెవిపిఎస్ విశాఖ జిల్లా ఉపాధ్యక్షులు వై.రాజు అన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతి వేడుకల్లో భాగంగా గురువారం ఎం.సుబ్బారావు అధ్యక్షతన ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలో కార్యక్రమం చేపట్టారు. తొలుత ఎల్ఐసి దరి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ బిజెపి వచ్చిన తర్వాత దళితులు, మైనారిటీలపై దాడులు విపరీతంగా పెరిగాయని, అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగాన్ని పూర్తిగా నిర్మూలన చేసి మనువాద రాజ్యాంగాన్ని ప్రవేశపెట్టారన్నారు. భారతదేశపు అభివృద్ధిని వందల ఏళ్ల వెనక్కి పంపించేందుకు ఆర్‌ఎస్‌ఎస్ ద్వారా కుట్ర జరుగుతోందన్నారు. అట్రాసిటీ కేసులను నిర్వీర్యం చేసి, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను వేరే కార్యక్రమాలకు మళ్లించి చట్టాలకు తూట్లు పొడుస్తున్నారన్నారు. బ్యాక్‌లాగ్ పోస్టులు తీయట్లేదని, దళితులకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తీవ్ర అన్యాయం చేస్తున్నాయని అన్నారు.

సిఐటియు జిల్లా కార్యదర్శి జి.అప్పలరాజు మాట్లాడుతూ త్రివర్ణ పతాకాన్ని అంగీకరించని ఆర్‌ఎస్‌ఎస్ విధానాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయడం దేశద్రోహమని అన్నారు. సిఐటియు జగదాంబ జోన్ ప్రధాన కార్యదర్శి కెవిపి.చంద్రమౌళి మాట్లాడుతూ దళితులు పోలీస్‌స్టేషన్‌కు వెళితే వారి గోడు వినిపించుకునే నాథుడు కూడా కొన్నిచోట్ల లేకుండాపోయారన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు కర్రి గణేష్, ఆంధ్రప్రదేశ్ మత్స్యకారుల సంఘం అధ్యక్షులు కె.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

యుపిఎస్‌సి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

ప్రజాశక్తి - కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ

ఈ నెల 16న జిల్లాలోయుపిఎస్‌సి నిర్వహించబోతున్న పోటీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో యుపిఎస్‌సి పరీక్షలకు సంబంధించి నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 16న నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నావల్ అకాడమీ ఎగ్జామినేషన్ (1), కంబైన్డ్ డిఫెన్స్ సర్వీస్ (1) - 2023 పరీక్షలు జరుగనున్నాయని తెలిపారు. ఈ పరీక్షలకు 6442 మంది అభ్యర్థులు జిల్లాలో హాజరుకానున్నట్లు వెల్లడించారు. అభ్యర్థులు, రూట్ ఆఫీసర్లు, ఇన్విజిలేటర్లు కోవిడ్ నిబంధనలు, యుపిఎస్‌సి గైడ్‌లైన్స్ తుచా తప్పకుండా పాటించాలని ఆదేశించారు.

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసమూర్తి

అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డును తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు. ప్రశ్నాపత్రాలు చేరవేత మొదలుకొని పరీక్షలు పూర్తయ్యాక బండిల్స్‌ను యుపిఎస్‌సికి చేరవేసే వరకూ నిబంధనలను అనుసరించి పనిచేయాలని లైజనింగ్ ఆఫీసర్లు, సూపరింటెండెంట్లకు సూచించారు. పరీక్షా కేంద్రాలకు మొబైల్ ఫోన్లు, కాలిక్యులేటర్లు, స్మార్ట్ వాచెస్ తదితరాలను తీసుకురాకూడదన్నారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే పరీక్షా కేంద్రంలోనికి అనుమతించాలని చీఫ్ సూపరింటెండెంట్లకు ఆదేశించారు. విద్యార్థులు వారి పరీక్షా సమయం కంటే అరగంట ముందుగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అన్నారు. విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని, పరీక్షా కేంద్రాల వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని, తాగునీరు వంటి సదుపాయాలు అందుబాటులో ఉంచాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. ఇన్విజిలేటర్లకు కూడా పరీక్షా కేంద్రాల్లో సెల్‌ఫోన్ అనుమతి వుండదని తెలిపారు. ఈ పరీక్షల నిర్వహణకు అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలన్నారు. సమావేశంలో యుపిఎస్‌సి అధికారులు, జివిఎంసి, పోలీస్, మెడికల్, ఇపిడిసిఎల్, వివిధ కాలేజీల లైజనింగ్ ఆఫీసర్లు, రెవెన్యూ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

మే 15న అందుబాటులోకి ఆక్వా స్పోర్ట్స్ ఈత కొలను

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మే 15కు బీచ్ రోడ్డులోని జివిఎంసి ఆక్వా స్పోర్ట్స్ ఈత కొలను అందుబాటులోకి వస్తుందని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి స్పష్టం చేశారు. కరోనా విపత్కర పరిస్థితుల తరువాత చాలా కాలంగా ఈత ప్రియులు, క్రీడాకారులకు దూరంగా ఉన్న ఈ కాంప్లెక్సును గురువారం ఆమె జివిఎంసి ప్రధాన ఇంజినీర్ రవికృష్ణరాజు, కార్యనిర్వాహక ఇంజినీర్ సుధాకర్ తదితరులతో కలిసి సందర్శించారు. ఈత కొలనుకు మరమ్మతులు చేపట్టి త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అనంతరం సుమారు రూ.65 లక్షలతో పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లకు అప్పగించారు.

రామానాయుడు స్టూడియోపై జగన్ కన్ను

మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖపట్నంలోని రామానాయుడు స్టూడియోపై ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కన్ను పడిందని టిడిపి మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి ఆరోపించారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్కాముల్లో ముఖ్యమంత్రి జగన్ ఆరితేరిపోయారని విమర్శించారు. విశాఖపట్నంలో రామానాయుడు స్టూడియోకు చంద్రబాబు ప్రభుత్వం ఎకరా రూ.20 లక్షలు చొప్పున 54 ఎకరాలను ఇచ్చిందని, రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో దానిని అడ్డుకోవాలని చూసినా ఆ ప్రయత్నం సఫలీకృతం కాలేదని అన్నారు. సిఎంగా జగన్ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి రామానాయుడు స్టూడియో స్థలంపై ఆయన కన్ను పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ స్థలంలో 17 ఎకరాలకు జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు పేరిట పవర్ ఆఫ్ అటార్నీ ఇవ్వడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. రామానాయుడు కుమారుడు, స్టూడియో అధినేత దగ్గుబాటి సురేష్ స్థలాన్ని జివిఎంసి కమిషనర్‌కు మార్ట్‌గేజ్‌కు ఎలా ఇస్తారని బండారు ప్రశ్నించారు. అసలు దీని ఆంతర్యం ఏంటో తక్షణమే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. స్టూడియో ప్రమోషన్‌కు ఇచ్చిన స్థలానికి లే అవుట్ ఎలా వేస్తారన్నారు. ఆ స్టూడియో స్థలాన్ని సొంతం చేసుకునేందుకు రెండేళ్లుగా వైసిపి నేతలు ప్రయత్నిస్తున్నారన్నారు. బదిలీపై వెళ్లిపోతున్న కమిషనర్ సదరు పత్రాలపై ఎలా సంతకం పెట్టారని, ఈ నెల 10న ఏ విధంగా రిజిస్ట్రేషన్ జరిపించారని నిలదీశారు. ఇప్పటికే మధురవాడ సబ్ రిజిస్ట్రార్‌కు స్థల హక్కుదారు సురేష్ బాబు లే అవుట్ పత్రాలు అందజేశారని గుర్తు చేశారు. గత కమిషనర్ రాజాబాబుకు బహుమతిగా జగన్ ప్రభుత్వం కలెక్టర్‌గా ప్రమోషన్ ఇచ్చిందన్నారు.

జగన్ చేస్తున్న స్కాముల్లో ఇదో పెద్ద స్కాం అని ఆరోపించారు. ఈ వ్యవహారంపై టిడిపి న్యాయ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. వైసిపి నేతలు అందరినీ బెదిరిస్తూ విశాఖలో విలువైన స్థలాలు లాక్కుంటున్నారని మండిపడ్డారు. ఈ విధంగా స్కాంలు చేస్తూ దేశంలో గొప్ప పేదవానిగా జగన్ పేరు తెచ్చుకున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో నడుస్తున్నది ప్రభుత్వమా లేక చేపల మార్కెట్టా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలంతా ఇవన్నీ గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో జగన్‌ను ఇంటికి పంపిస్తారని జోస్యం చెప్పారు.

ప్రభాకర్‌ను సత్కరిస్తున్న అతిథులు

దర్శకుడు ప్రభాకర్‌కు సత్కారం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖలో ప్రతిభగల కళాకారులకు కొదవలేదని కళింగ వైశ్య సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అంధవరపు కోటేశ్వరరావు అన్నారు. సినీ దర్శకులు ఆరిపాక ప్రభాకర్ విశాఖ జర్నలిజం రంగం నుంచి ఎదిగి కర్ణాటక రాష్ట్రంలో ఉత్తమ దర్శకునిగా అవార్డు పొందిన సందర్భంగా గురువారం సనారా, చందు ఆర్ట్స్ మూవీస్ ఆధ్వర్యంలో విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కోటేశ్వరరావు మాట్లాడుతూ ఆరిపాక ప్రభాకర్ విశాఖలోనే జర్నలిస్టుగా పనిచేసి, హైదరాబాదులో సినీ దర్శకుడుగా మారి తొలి చిత్రంతోనే కర్ణాటకలో బెస్ట్ డైరెక్టర్ అవార్డు తీసుకోవడం అభినందనీయమని చెప్పారు. ఆయన మరిన్ని మంచి చిత్రాలు రూపొందించి, అవార్డులు సాధించాలని ఆకాంక్షించారు. గౌరవ అతిథిగా హాజరైన జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ ప్రముఖ కన్నడ సినీ మ్యాగజైన్ 'చిత్ర సంతే' బెంగళూరులో నిర్వహించిన ఫిల్మ్ అవార్డ్స్ 2023లో ఆరిపాక ప్రభాకర్ దర్శకత్వం వహించిన సీతాయణ చిత్రానికి మూడు అవార్డులు దక్కాయన్నారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు ఎన్.నాగేశ్వరరావు, విజెఎఫ్ కార్యదర్శి దాడి రవికుమార్, ఉపాధ్యక్షులు నాగరాజ్ పట్నాయక్, సీనియర్ జర్నలిస్టులు బిఎస్.చంద్రశేఖర్, డేవిడ్ రాజు, నేమాల హేమసుందర్, గొండు అచ్యుతరావు, సీనియర్ నటులు బాదంగీర్ సాయి, గాయకుడు గడసాపు శ్రీను, రచయిత పట్నాన శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ చేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అంబేద్కర్ జయంతి సందర్భంగా డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో మద్దిలపాలెం పిఠాపురం కాలనీలో గురువారం మజ్జిగ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని డివైఎఫ్ఐ మాజీ రాష్ట్ర సహాయ కార్యదర్శి వి.కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజు, సంతోష్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని, అది కల్పించే హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎండలు ఎక్కువగా ఉన్న తరుణంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వడదెబ్బ బారిన పడకుండా ఉండేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. యువత కోసం పోరాటాలే కాకుండా సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు సతీష్, రఘురాజా, తులసి, లక్ష్మణ్, దివాకర్ పాల్గొన్నారు.